

రాయపర్తి : సూర్యతండాలో గులాబీ శ్రేణులతో ముచ్చటిస్తున్న మండల నాయకులు



పర్వతగిరి : వెంకటేశ్వరకాలనీలో ప్రచారం చేస్తున్న మాజీ కార్పొరేటర్ కల్పన

# బీఆర్ఎస్ విస్తృత ప్రచారం

- **వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోరుతూ ఇంటింటి ప్రచారం**
- **తొమ్మిదిన్నరేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు**

వర్ధన్నపేట, అక్టోబర్ 31 : బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపును కోరుతూ వర్ధన్నపేట పట్టణంతో పాటు గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 11వ వార్డులో జరిగిన ఎన్నికల ప్రచారం మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సిలువేరు కుమారస్వామి పాల్గొని కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేళ్లలోనే వర్ధన్నపేట పట్టణం, మండలంలోని గ్రామాలు ఎంతగానో అభివృద్ధి సాధించాయన్నారు. గతంలో గ్రామాలు, పట్టణ ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. తాగునీటి కోసం మహిళలు, సాగునీటి కోసం రైతులు రహదారులపై రాస్తారోకోలు చేసేవారన్నారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనా దక్షతతో రైతులకు సాగునీటితో పాటు 24గంటల ఉచిత విద్యుత్, గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు అందుతుందన్నారు. అలాగే పేదలకు అన్ని విధాలుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. వచ్చే రోజులలో ప్రజలకు మంచి జరగాలంటే విధిగా బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### ఎమ్మెల్యే అరూరికి హ్యాట్రిక్ ఖాయం

హసన్‌పర్తి, అక్టోబర్ 31 : వచ్చే ఎన్నికల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ మూడోసారి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించడం ఖాయమని మార్కెట్ డైరెక్టర్ గనిపాక విజయ్ తెలిపారు. గ్రేటర్ రెండో డివిజన్ పరిధిలోని గుండ్ల సింగారం, వెంకటేశ్వరకాలనీలో విజయ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అరూరి గెలుపు కోసం మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారానికి ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ బానోత్ కల్పనా హాజరయ్యారు. అనంతరం గడపగడపకూ వెళ్లి కారుగుర్తుకు ఓటేసి అరూరి రమేశ్‌కు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు జన్ను రాజు, సయ్యద్ ఖలీల్, మొగిలి, కల్యాణ్, కృష్ణ, యూత్ అధ్యక్షుడు శివ, రాజునాయక్, వెంకటేశ్ పాల్గొన్నారు.

### గ్రామాల్లో జోరుగా ప్రచారం

రాయపర్తి, అక్టోబర్ 31 : నవంబర్‌లో జరుగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోరుతూ మంగళవారం మండలవ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గడపగడపకూ బీఆర్ఎస్ పేరుతో మండలంలోని 40గ్రామ పంచాయతీల్లో గ్రామ అధ్యక్ష కార్యదర్శుల ఆధ్వర్యంలో గులాబీ దళం ప్రచారం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధుల నేతృత్వంలో గ్రామ పార్టీల ముఖ్యకార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలు, ఓటర్లను ఆకట్టుకునే పద్ధతులు, ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న మాయదారి, మోసపూరిత కార్యక్రమాలపై చైతన్యం కలిగించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో మండల నాయకుడు గుడిపూడి గోపాల్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గీత కార్మిక సంఘం మండల కమిటీ

శాయంపేట, అక్టోబర్ 31 : మండలంలోని 11కల్లుగీత కార్మికుల సొసైటీల ఆధ్వర్యంలో మంగళవారం కల్లుగీత కార్మిక సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాయంపేట మండల కల్లుగీత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడిగా పెరుమాండ్ల చేరాలును, మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా తడుక కుమారస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బండి రాములు, న్యాతి గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా అల్లం శ్రీధర్, సహాయ కార్యదర్శులుగా గట్టు రమేశ్, తాటికొండ శ్రీకాంత్, బొడిగ కొమురయ్య , కార్యనిర్వాహక కార్యదర్శులుగా ముక్కెర మొగిలి, తడుక శ్రీనివాస్, కూనూరు రాజు, సలహాదారులుగా బొనగాని రాజేశ్, మాచర్ల బాలకిషన్, కోశాధికారిగా బండి చేరాలు, వలుగుల రమేశ్, తడుక సదానందంతోపాటు 11మంది సభ్యులతో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తమ ఎన్నికకు సహకరించిన నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపిది.

## భోగేశ్వరాలయ గోపురం ధ్వంసం

దామెర, అక్టోబర్ 31: మండలంలోని ల్యాదెల్లలో కాకతీయులకాలం నాటి శ్రీభోగేశ్వరాలయ గోపురాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు స్థానికులు, అర్చకుడు కొలనుపాక వీరమల్లయ్య తెలిపారు. సోమవారం అర్ధరాత్రి ఆలయ గోపురంపైన ఉన్న మైకును తొలగించి గోపురాన్ని ధ్వంసం చేశారు. గుప్తనిధులకోసమే ఆలయ గోపురాన్ని ధ్వంసం చేసినట్లు వారు అనుమానిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు వీరమల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## 'అధిక సాంద్రత పద్ధతి సాగు లాభదాయకం'

గీసుగొండ, అక్టోబర్ 31: అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంటను సాగు చేస్తే అధిక దిగుబడి పొందవచ్చని తెలంగాణ పీవీ నరసింహరావు పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ అధికారి డాక్టర్ మహేందర్, జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్ తెలిపారు. మండలంలోని అనంతారంలో మంగళవారం అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన పత్తి పంటను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ పద్ధతిలో పంట కాలం తక్కువగా ఉండటంతో రెండు పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజన్న, ఏఈవో హరిప్రసాద్‌బాబు, డాక్టర్ సౌమ్య, రైతులు ధనేకుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గుడుంబా పట్టివేత

గీసుగొండ, అక్టోబర్ 31 : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ జాన్‌పాక గ్రామంలో మంగళవారం గుడుంబా విక్రయిస్తున్న ధరావత్ క్రాంతి తన ఇంట్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేశారు. 40లీటర్ల గుడుంబాను పట్టుకుని క్రాంతిపై కేసునమోదు చేసినట్లు సీఐ పవన్‌కుమార్ తెలిపారు.

## రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు, అక్టోబర్ 31 : గత నాలుగున్నరేళ్లుగా ఎంపీపీగా కొనసాగుతున్నావు, ఈ రోజు కాంగ్రెస్ పార్టీలోకి మారి, ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నావంటూ తిరుమలగిరి సర్పంచ్ రంపీస మనోహర్, కటాక్షపురం సర్పంచ్ మచ్చిక యాదగిరి, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఎంపీపీ మార్క సుమలత అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. వివిధ శాఖలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మార్క సుమలత భర్త రజనీకర్ తీరుపై సర్పంచులు మనోహర్, యాదగిరి, వైస్‌ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి విరుచుకుపడ్డారు. పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, వైద్యాధికారి స్పందన, ఎంఈవో రమాదేవి, ఏపీవో రాజిరెడ్డి, పీఆర్ ఏఈ,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు లత, సతీశ్, వార్డెన్లు రవికుమార్, శ్రీనివాస్, ఏపీవో రాజిరెడ్డి, ఎంపీటీసీలు అర్షం వరుణ్‌గాంధీ పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ఏక్తా దివాస్

పరకాల/నడికూడ, అక్టోబర్ 31 : భారత తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని పరకాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, నడికూడ మండలంలోని చర్లపల్లి పాఠశాలలో జాతీయ ఏక్తా దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ బీ సంతోష్‌కుమార్, కే సంపత్‌కుమార్, ఉపాధ్యాయులు మాట్లాడుతూ భారత స్వాతంత్రం అనంతరం భారతదేశంలోని అన్ని సంస్థాలను విలీనం చేసి అఖండ భారత్‌ను స్థాపించిన గొప్ప వ్యక్తి అని, ఆయన సేవలకు గుర్తుగా భారత రత్న బిరుదుతో దేశం సత్కరించిందన్నారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సఖి సేవలపై అవగాహన

మడికొండ, అక్టోబర్ 31 : మడికొండ, అయోధ్యపురం, కడిపికొండ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సఖి వన్‌స్టాప్ ఆధ్వర్యంలో మంగళవారం సఖి సేవలపై కేస్ వర్కర్లు వినీల, హరిత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరకట్న, లైంగిక వేధింపులు, భ్రూణ హత్యల నివారణకు సఖి వన్ స్టాఫ్ కేంద్రం కృషి చేస్తుందని చెప్పారు. సఖి కేంద్రంకు వచ్చిన బాధిత మహిళలకు ఉచితంగా కౌన్సెలింగ్, న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి వంటివి అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, వనజ, స్వర్ణలత, లావణ్య పాల్గొన్నారు.

## పీటీసీలో ఓపెన్‌హౌస్

కరీమాబాద్, అక్టోబర్ 31 : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని మామునూరులోని పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ ఆధ్వర్యంలో మంగళవారం ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయుధాల పనితీరును విరించారు. కార్యక్రమంలో పీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాలయ నిర్మాణానికి విరాళం

పర్వతగిరి, అక్టోబర్ 31 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కంఠమహేశ్వర స్వామి, వనం ఎల్లమ్మ, మైసమ్మ తల్లి దేవతల దేవాలయ నిర్మాణాలకు మండల కేంద్రానికి చెందిన రంగు కరుణాకర్ మంగళవారం విరాళం అందించారు. తన భార్య రంగు శ్రీమతి జ్ఞాపకార్థం రూ.10వేలు అందించినట్లు పర్వతగిరి గౌడ సంఘం నాయకులు తెలిపారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఉప్పరపల్లి విద్యార్థి



వర్ధన్నపేట, అక్టోబర్ 31 : నవంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు వరంగల్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మండలంలోని ఉప్పరపల్లి పాఠశాల విద్యార్థి శాగంటి రాంచరణ్ ఎంపికైనట్లు పీఈటీ వీరస్వామి తెలిపారు. ఈనెల 30న వరంగల్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో ఉప్పరపల్లి పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న శాగంటి రాంచరణ్ 25 కేజీల విభాగం అండర్-14లో ఎస్‌జీఎఫ్ఐ క్రీడలో పాల్గొని ప్రథమ స్థానం దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో రాంచరణ్ పాల్గొంటాడని ఆయన తెలిపారు. రాంచణ్‌ను హెచ్ఎం వేణు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.

# గెలువడం చేతకాకే దాడులు

### విలేకరుల సమావేశంలో ఎంపీపీ, జడ్పీటీసీ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ మార్గం భిక్షపతి

వర్ధన్నపేట, అక్టోబర్ 31 : ప్రజా క్షేత్రంలో గెలువడం చేతకాక విపక్ష పార్టీలు భౌతికదాడులకు పాల్పడుతున్నాయని వర్ధన్నపేట ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతిలు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్యకర్త దాడికి పాల్పడడం హేయమైన చర్య అని అన్నారు. ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే విపక్ష పార్టీలు బీఆర్ఎస్ కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని యావత్ తెలంగాణ సమాజం ఖండించాలని వారు కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, ఏఎంసీ చైర్మన్ స్వామిరాయుడు, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్‌ఖన్నా, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, పట్టణ అధ్యక్షుడు పులి పాల్గొన్నారు.

# మడికొండలో కేంద్ర బలగాల కవాతు

మడికొండ, అక్టోబర్ 31 : ఎన్నికలను పురస్కరించుకుని మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో మడికొండ, అయోధ్యపురం, కడిపికొండ గ్రామాల్లో కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా డేవిడ్ రాజు మాట్లాడుతూ ఎన్నికల్లో తమ హక్కును ఓటరు ఖచ్చితంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని చెప్పారు. కార్యక్రమంలో మడికొండ ఇన్‌స్పెక్టర్ వేణు, ఎస్సైలు రాజబాబు, దివ్య పాల్గొన్నారు.

# 'మహనీయులను మరువొద్దు'

కరీమాబాద్, అక్టోబర్ 31 : దేశం కోసం.. ప్రజల కోసం పని చేసిన మహనీయులను మరువద్దని 4వ బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం మామునూరులోని 4వ బెటాలియన్‌లో భారతదేశ తొలిఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని 'ఏక్తాదివస్' నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సర్దార్ వల్లబాయ్ పటేల్ పోరాట యోధుడని అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు.

కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కమాండెంట్లు జయరాం, రాంబాబు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శివప్రసాద్‌రెడ్డి